
RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే
QUICK TODAY
సోమవారం 9 ఫిబ్రవరి 2026
quicktodaynews.com


# ఉగ్రవాదంపై రాజీలేదు

ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. మరోవైపు వివాదాస్పద మత గురువు జాకీర్ నాయక్‌ను ఇండియాకు అప్పగించే అంశంపై కూడా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ఇండియాకు చెందిన జాకీర్ నాయక్.. కొన్నేళ్లుగా మలేసియాలో ఉంటున్నాడు. ఇండియాలో దూసుకుపోతున్న యూపీఐ సేవలు త్వరలో మలేసియాలో కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ.. మలేసియా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. మలేసియాలో కూడా త్వరలోనే యూపీఐ సేవల్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అయితే, ఎప్పటినుంచి అందుబాటులోకి వచ్చేది వెల్లడించలేదు. ఈ సేవలు అక్కడ ఉంటున్న భారతీయులకు మేలు కలిగిస్తాయని మోదీ అన్నారు.









## నోబెల్ గ్రహీత నర్గిస్ మొహమ్మదీకి
# మరోసారి జైలు శిక్ష

### 6 సంవత్సరాల జైలుతో పాటు రెండేళ్ల ప్రయాణ నిషేధం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి8:**

ఇరాన్‌లో మహిళల హక్కులు, మానవ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రముఖ కార్యకర్త, 2023 నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నర్గిస్ మొహమ్మదీకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. అక్కడి న్యాయస్థానం ఆమెకు 6 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారన్న ఆరోపణలపై ఈ తీర్పు వెలువరించింది. ఆమె న్యాయవాది మొస్తఫా నిలి ఈ వివరాలు వెల్లడించారు. నేరాలు చేయడానికి సమూహంగా ఏర్పడ్డారన్న అభియోగంపై ఆరేళ్ల జైలు శిక్ష విధించారని తెలిపారు. దీనితో పాటు ప్రభుత్వ వ్యతిరేక ప్రచార కార్యకలాపాలకు సంబంధించి మరో ఒకటిన్నర సంవత్సరాల శిక్ష కూడా పడింది. అయితే, ఇరాన్ చట్టాల ప్రకారం ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలవుతాయి. శిక్షాకాలం పూర్తయ్యాక రెండేళ్ల పాటు దేశం విడిచి వెళ్లరాదని, మరో రెండేళ్ల పాటు సౌత్ ఖొరాసాన్‌లోని ఖోస్ఫ్ నగరంలో బహిష్కరణ శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. 53 ఏళ్ల నర్గిస్ మొహమ్మదీ గత 25 ఏళ్లుగా ఇరాన్‌లో మరణశిక్షకు, మహిళలపై తప్పనిసరి హిజాబ్ నిబంధనకు వ్యతిరేకంగా బలమైన గళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె తన జీవితంలో ఎక్కువ భాగం జైలులోనే గడిపారు. జైలులో



ఉండగానే గత ఏడాది ఆమె ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు. ఆమె తరఫున, పారిస్‌లో ఉంటున్న ఆమె కవల పిల్లలు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అనారోగ్య కారణాలతో గత డిసెంబర్‌లో మూడు వారాల పాటు తాత్కాలికంగా విడుదలైన ఆమెను, తర్వాత మళ్లీ అరెస్టు చేశారు. తాజా తీర్పు ఇంకా తుది కాదని, దీనిపై అప్పీల్ చేస్తామని ఆమె న్యాయవాది తెలిపారు. నర్గిస్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆమెకు బెయిల్ లభిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఇద్దరు పిల్లలను చంపి
# తల్లి ఆత్మహత్య

**అమరావతి, ఫిబ్రవరి8 (క్విక్ టుడే న్యూస్):**

ఏపీలో దారుణం జరిగింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న వివాహిత ఆర్థిక కష్టాలతో ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకుంది. తిరుపతి జిల్లా పుత్తూరులో పుత్తూరు మండలం నేషనూరుకు చెందిన పద్మ (28), తొరూరు పంచాయతీకి చెందిన శివశంకర్ పుత్తూరులో డిగ్రీ చదువుకునే రోజుల్లో ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ పెళ్లికి కులాలు వేరు కావడంతో పాటు , శివశంకర్ జులాయిగా తిరుగుతున్నాడని పద్మ తల్లిదండ్రులు వివాహానికి నిరాకరించారు. దీంతో ఇద్దరు 2019లో వివాహం చేసుకోగా వీరికి తేజ(6), లాస్య(5) కుమార్తెలు పుట్టారు. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దె, ఇతర ఖర్చులకు ప్రతినెలా ఇబ్బంది పడుతుండడంతో, భర్త ఇంటి విషయాలు పట్టించుకోవడం లేదని ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. చివరకు శనివారం రాత్రి 'తల్లిదండ్రులను కాదని పెళ్లి చేసుకున్న ప్రతి ఒక్కరికీ నా జీవితం ఓ గుణపాఠమంటూ' సూసైట్ నోట్ రాసి ఇద్దరి పిల్లలకు ఉరివేసి ఆత్మహత్య చేసుకుంది. ఒక అమ్మాయి ఎలాంటి లక్షణాలు తన భర్తకు ఉండకూడదని అనుకుంటుందో, అవన్నీ నా భర్తలో ఉన్నాయి. ఇది నేను కలలోనూ అనుకోలేదు. శివశంకర్, నిన్ను ప్రేమ వివాహం చేసుకున్న పాపానికి ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు. నా కడుపున పుట్టిన పిల్లలు కూడా ఆ కష్టాన్ని అనుభవిస్తున్నారు. ఊరంతా అప్పులు చేసి, తీర్చలేనంటే.. నేనేం చేయాలి. ఇక ఉంటా ! నేను చనిపోయాక ఎలాగో ఇంకో పెళ్లి చేసుకుంటావు. ఈ సారైనా లైఫ్ సెటిల్ అయ్యాక చేసుకో అని లేఖ రాసి ఈ అఘాత్యానికి పాల్పడింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భర్త శివశంకర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





# వీధి రౌడీల్లాగ రేవంత్ భాష

## వెకిలి ముఖ్యమంత్రిని మీరు మెచ్చుకుంటున్నారా?

## మిషన్ భగీరథను కనీసం నడిపే తెలివి లేని సీఎం

## ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి కొరడాతో వాతలు పెట్టండి

## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీశ్‌రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి8 (క్విక్ టుడే న్యూస్):**

రాష్ట్రంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారితే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళ్లకు మాత్రం గంతలమయంగా మారిందని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గల్లీల్లో వీధి దీపాలు మార్చడం లేదు గానీ.. రేవంత్ రెడ్డి భాష మాత్రం వీధి రౌడీలా తయారైందని విమర్శించారు. ఒక ముఖ్యమంత్రి ఉండాల్సిన పద్ధతి ఇదేనా? ఇంత వెకిలిగా ప్రవర్తించడాన్ని మీరు మెచ్చుకుంటున్నారా? అని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హరీశ్‌రావు ఆదివారం నాడు జహీరాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రోడ్ షోల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ దద్దమ్మ పాలనలో కేసీఆర్ కష్టపడి కట్టిన మిషన్ భగీరథను కనీసం నడిపే తెలివి కూడా లేకపోయిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చాక దోమల నివారణకు ఫాగింగ్ లేదు గానీ.. పాలనలో అంతా ఫ్రాడింగ్ నడుస్తోందని అన్నారు. గల్లీల్లో మురుగు నీరు పారుతుంటే.. ముఖ్యమంత్రి నోటి నుంచి అంతకంటే దారుణమైన మురికి మాటలు వస్తున్నాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో పేదలకు స్కీంలు బంద్ అయ్యాయి.. కాంగ్రెస్ నాయకులకు స్కాంలు మాత్రం ఫుల్లుగా నడుస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. రేవంత్ రెడ్డి ప్రజలకు చేసింది ఏమీ లేదు.. గొప్పగా చెప్పుకోవడానికి ఒక్క పని లేదని అన్నారు. అందుకే కేసీఆర్ మీద విషం చిమ్మే మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఆయన పాలనలో పిచ్చితనమే తప్ప పచ్చదనం ఎక్కడా లేదని విమర్శించారు. తండ్రి వయస్సు ఉన్న కేసీఆర్‌ను పట్టుకొని, కనీస గౌరవం, నీతి లేకుండా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ ఎన్నికల్లో ఓటు అనే కొరడాతో ప్రజలు రేవంత్ రెడ్డికి వాతలు పెట్టాలని హరీశ్‌రావు కోరారు. నా పొడుగు గురించి, కేటీఆర్ ఇంగ్లీష్ గురించి మాట్లాడే రేవంత్ రెడ్డికి.. ఇంగ్లీష్ రాదు, పాలన రాదని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను చూసి పాలన ఎలా చేయాలో నేర్చుకోవాలని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ కు లేదని హరీశ్‌రావు అన్నారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ముస్లిం మైనార్టీకి మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని బీఆర్ఎస్ నిలదీస్తేనే.. దిగొచ్చి అజారుద్దీన్ కు ఇప్పుడు మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు.బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ.. మేము నియత్ ఉన్న వాళ్లమని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క హిందూ–ముస్లిం గొడవ జరగలేదని గుర్తుచేశారు..

కేసీఆర్ రాష్ట్రాన్ని తెచ్చి, అభివృద్ధి చేసి చూపించారని హరీశ్‌రావు తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరలు.. ఇలా ఎన్నో పథకాలు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ వచ్చాక అవన్నీ బంద్ అయ్యాయని తెలిపారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం గతంలో రూ. 200 కోట్లు ఖర్చు చేశామని., బాగారెడ్డి ఫ్లై ఓవర్ వేయించాం, గల్లీ గల్లీలో రోడ్లు వేయించామని తెలిపారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు పనుల నాణ్యత చూడటానికి సైకిల్ మీద తిరిగిన రోజులు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక జహీరాబాద్ లో ఎక్కడి గొంగలి అక్కడే అన్నట్లుగా తయారైంది. ఒక్క పని కూడా చేయలేదని అన్నారు. తులం బంగారం ఏమైంది అని అడిగితే రేవంత్ రెడ్డి నోరు మెదపడు.. మహిళలకు ఇస్తానన్న రూ. 2500 మహాలక్ష్మి ఏమైంది అంటే మాట్లాడడు అని హరీశ్‌రావు తెలిపారు. ప్రశ్నిస్తే మాకు నోటీసులు ఇస్తున్నాడని అన్నారు. నాకు నోటీసులు ఇస్తేనో, నా మీద కేసులు పెడితేనో పేదోళ్ల కడుపులు నిండుతాయా అని ప్రశ్నించారు. మీరు వంద నోటీసులు ఇచ్చినా భయపడేది లేదని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పైసలు వచ్చే దాకా మీ వెంట పడుతూనే ఉంటామని తెలిపారు. కేటీఆర్ ను తిట్టే బదులు.. రోడ్ల మీద ఉన్న గుంతలు పూడ్చాలని హితవు పలికారు. కేటీఆర్‌కు ఇంగ్లీష్ వచ్చని తిడతాడు, నా పొడుగును చూసి నన్ను తిడతాడు. అసలు ముఖ్యమంత్రి అంటే ఇలాగేనా ఉండేది అని హరీశ్‌రావు మండిపడ్డారు. అతి నీచమైన బూతులు మాట్లాడిన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్ర సృష్టించుకున్నాడని అన్నారు. చరిత్రలో ఎవరైనా నిలవాలి కానీ.. ఇలా రేవంత్ రెడ్డిలా చరిత్రహీనుడిగా మిగిలి పోకూడదని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి మున్సిపల్ శాఖ కూడా ఉంది. కానీ ఆయన నోరు కచ్రా .. ఆయన చూస్తున్న మున్సిపాలిటీల్లోనూ అంతా కచ్రానే ఉందని అన్నారు. సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే ఉన్నాయని.. జహీరాబాద్ మున్సిపా



లిటీల్లో ఎగిరేది గులాబీ జెండానే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జహీరాబాద్ లో జరిగిన అభివృద్ధి కేసీఆర్ వల్లే సాధ్యమైందని తెలిపారు. అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. తెలంగాణ అంటేనే బీఆర్ఎస్ కామ్.. బీఆర్ఎస్ కా నామ్ అని హరీశ్‌రావు అన్నారు. కానీ ఎంఐఎం పార్టీ మహారాష్ట్రలో బీజేపీతో అంటకాగుతోందని తెలిపారు. అక్కడ ఏకంగా మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలను బీజేపీతో పంచుకుందని చెప్పారు. అక్కడ బీజేపీతో కలిసి పని చేస్తూ.. జహీరాబాద్ లో లౌకికవాదం గురించి మాట్లాడితే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి మరీ ప్రజలను మోసం చేశారని అన్నారు.బాండ్ పేపర్ రాసిచ్చి కూడా రెండున్నరేళ్లలో హామీలు అమలు చేయని వాళ్లు.. ఇప్పుడు మళ్లీ కొత్త బాండ్ పేపర్లు రాసిస్తామంటే ఎవరు నమ్ముతారు అని ప్రశ్నించారు. అది అంతా బూటకమని తెలిపారు. కొత్త పథకాలు ఇవ్వకపోగా ఉన్న పథకాలన్నీ బంద్ పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు..










## కాంగ్రెస్ నాయకులు